క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి..

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ తెలిపారు. మండలంలోని లుంబూరు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరుగుతున్న నిర్వహణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్లౌజులు, బూట్లు, హెల్మెట్ల వాడకంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ స్తంభాలు ఎక్కే సమయంలో, పొలాలు, పంపుహౌస్‌ల వద్ద మరమ్మతులు చేపట్టే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాహనాల వేలం రేపు

కురుపాం: స్థానిక సెబ్ కార్యాలయం వద్ద ఈ నెల 24న వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ కె.జోగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల సారా తరలిస్తూ పట్టుబడిన ఒక ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనం ఒకటి వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు వేలం రోజున రూ.2 వేలు ముందస్తుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

వితరణ ..



బాల్, బ్యాలెన్స్ బోర్డు కిట్లను ఎంఈఓకు అందిస్తున్న శ్రీనివాసరావు

పాలకొండ రూరల్ : ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం స్థానిక వ్యాపారి శిల్లా శ్రీనివాసరావు స్విస్‌బాల్, బ్యాలెన్స్ బోర్డు కిట్లను వితరణగా అందించారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో సదరు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ శిబిరంలో ఈ పరికరాలను మండల విద్యాశాఖాధికారి కురిటి సోంబాబుకు అందించారు. అంతకు ముందుకు ఫిజియోథెరపిస్టు ఆర్.శ్రీకాంత్ చిన్నారులతో తేలికపాటి వ్యాయామాలు చేయించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ఎం.అరుణ కుమారి, సీహెచ్‌వీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ టి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో భోజన నిర్వాహకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వంట సమయంలో పరిశుభ్రతను పాటించాలన్నారు. పాఠశాల ఆవరణలో మురుగు లేకుండా చూడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు వంటకాలను తయారు చేయాలన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఎంఈఓ నాగభూషణరావు ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



నల్లరాయిగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు ఆధ్వర్యంలో డెంగీ జ్వరాలపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ కారక దోమల వ్యాప్తి, నివారణ చర్యలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గిరిజనులకు వైద్య సేవలందించారు.

పడవల రాకపోకల నిలిపివేత

భామిని: వంశధారకు వరదనీరు పోటెత్తడంతో పడవలో రాకపోకలను నిలిపివేశారు. నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరకపోయినప్పటికీ, అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పడవ ప్రయాణాలను ఆపేశారు. ఇప్పటికే మండలంలోని నదీ తీరప్రాంత గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

వీరఘట్టం: మండల పరిధి వీరఘట్టం మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చాలా వీధుల్లో కుళాయిలు మురుగుకాలువల్లో ఉన్నాయన్నారు. దీంతో తాగునీరు కలుషితమవుతోందని తెలిపారు. అలాగే పలు వీధుల్లో కుళాయిలు పాడయ్యాయని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆశలు నెరవేరేనా..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నలభై రోజులు పూర్తయ్యాయి. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో కూటమి నాయకులు హామీలిచ్చారు. అయితే ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాలు లేవు. పైగా సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో స్థానిక సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించి, పరిష్కరిస్తారన్న ఆశతో స్థానిక ప్రజలున్నారు. ఎమ్మెల్యేలు సమస్యలపై చర్చించి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్

ఎత్తిపోతల పథకం మంజూరు చేయించండి



భామిని మండల రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట భూములకు సాగునీరు అందించేందుకు వడ్డంగి వద్ద ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి. కాట్రగడ, వడ్డంగి, బొమ్మిక, గురండి, లోహరిజోల, నేరడి–బికి చెందిన పంట భూములకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉంది. గతంలో ఇచ్చిన ఈ హామీని నెరవేర్చి రైతులను ఆదుకోవాలి.

సిరిగంటి రామారావు, రైతు, నేరడి–బి, భామిని మండలం

పూర్ణపాడు - లాబేసు వంతెనపై ఆశలు



కొమరాడ మండలం ప్రధాన సమస్య పూర్ణపాడు – లాబేసు వంతెన నిర్మాణం. మండలం మొత్తం 31 పంచాయతీలకు గాను నాగావళి నది ఓ వైపు 10 పంచాయతీలు మరో వైపు 21 పంచాయతీలు ఉన్నాయి. దీంతో మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టేలా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శాసనసభలో ప్రస్తావించాలి.

– యేగిరెడ్డి సింహాచలం, తొడుము, కొమరాడ

ఏనుగుల సమస్య పరిష్కరించాలి ..



సీతంపేట ఏజెన్సీలో ఏనుగుల సమస్య అధికంగా ఉంది. ప్రతి ఏటా పంటలను నాశనం చేస్తున్నాయి. అరటి, జీడిమామిడి, తదితర పంటలు సాగుచేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అసెంబ్లీలో ఈ సమస్యపై చర్చించి, రైతులకు న్యాయం చేయాలి.

– మంగయ్య, మోహన్‌కాలనీ, సీతంపేట

ఉపాధి లేదు..



పాలకొండ ప్రాంతంలో పారిశ్రమలు లేకపోవడంతో యువతకు ఉపాధి లభించడం లేదు. ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం ఈ ప్రాంతానికి వచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానని భరోసా ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే అవకాశంపై అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు పవన్‌కల్యాణ్ ప్రస్తావించాలి.

– ఎస్.విజయ్‌కుమార్, కోటిపల్లి, పాలకొండ మండలం

రైతుబజార్ అవసరం



ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో రైతులు ఉన్నారు. వీరిలో 38 శాతం మంది కూరగాయలు పండిస్తూ జీవనం సాగిస్తారు. ఈ క్రమంలో ఈ ప్రాంత రైతుల ఆకాంక్షల మేరకు రైతుబజార్ ఏర్పాటు అవసరం. అధికారంలోకి వస్తే రైతుబజార్ ఏర్పాటు చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారమయ్యేలా చూడాలి.

– తిర్లంగి ఉపేంద్రకుమార్, సర్పంచ్, లుంబూరు పంచాయతీ, పాలకొండ మండలం

రోడ్లు వేయండి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. మిని మండలంలోని ఏబీడ్డు దుస్థితిపై అసెంబ్లీలో లేవనెత్తండి. ఒడిశా సరిహద్దుకు అనుబంధంగా ఏబీ రోడ్డు విస్తరణతో పాటు నిర్మాణానికి ఇచ్చిన హామీ నిలబెట్టుకోండి. వాహనదారుల కష్టాలు తీర్చండి.

రొక్కం రామారావు, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు, బాలేరు, భామిని మండలం

గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తయ్యేనా..



కురుపాం: కురుపాం పంచాయతీ పరిధి టేఖరఖండి గిరిజన గ్రామ సమీపంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 105 ఎకరాల్లో రూ.190 కోట్ల అంచనాతో నిర్మాణం చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తయ్యేనా.. అని గిరిజన విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. దీని పనులు పూర్తయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలో ఉన్న నిరుపేద గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందే అవకాశం ఉంటుంది. ఈ దిశగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకోవాలని గిరిజన విద్యార్థులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి ఆయన ఫోన్‌లో సాక్షితో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి నాయకులు రెడ్‌బుక్ పేరుతో రక్తచరిత్ర రాస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దిశ చట్టం పూర్తిగా నీరుగారిపోవడంతో మానవ మృగాలు చేలరేగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- సూపర్ సిక్స్ అమలు చేసేదెప్పుడు...?
- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం తన స్వగ్రామం వండవలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలుచేస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అవి సూపర్ సిక్స్ హామీలు కావని.. సెల్ఫ్ ఔట్ హామీలని ఎద్దేవా చేశారు. గతేడాది జూన్ 23న అమ్మఒడి పథకంలో భాగంగా ప్రతి తల్లికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.15 వేలు జమచేసిందన్నారు. ఇదే పథకాన్ని తల్లికి వందనం అంటూ పేరు మార్చిన కూటమి ప్రభుత్వం ప్రతి తల్లికీ పంగనామం పెట్టిందన్నారు. పాఠశాలలు తెరిచి 40 రోజులు గడుస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం డబ్బులు విడుదల చేయకపోవడం చాలా అన్యాయమన్నారు. అలాగే భవన నిర్మాణాలకు ఉచిత ఇసుక ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం తన అనుచరులతో ఇసుక దందా చేస్తూ భవన నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు. భామిని మండలంలో ఇసుక దందా యథేచ్ఛగా జరుగుతున్నా యంత్రాంగ చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తోటపల్లి పాత ఆయకట్టును సకాలంలో ఆధునీకరించి రైతులకు అండగా ఉంటామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు.

పెద్దూరు చెరువుకు గండి



చెరువుకు పడిన గండి

గరుగుబిల్లి: పెద్దూరులోని దక్షిణాయుని చెరువుకు సోమవారం ఉదయం గండి పడింది. చెరువు పైభాగం నుంచి ఒక్కసారిగా వరద రావడంతో చెరువుకు గండి పడింది. చెరువు ఆయకట్టులోని సుమారు 30 ఎకరాల పైగా పంట ముంపునకు గురైంది. గండి పూడ్చేందుకు రైతులు ఇసుక బస్తాలతో గండిని పూడ్చాలని ప్రయత్నించినప్పటికీ అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. రావుపల్లిలోని ఎస్సీ కాలనీలోని యందవ తవుడుకు చెందిన ఇళ్లు వర్షాలకు కూలిపోయింది. ఇంటికి వెనుక భాగంలో నీరు నిల్వ వుండడంతో గోడ కూలిపోయినట్లు ఆయన తెలిపారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

ఫిర్యాదులపై స్పందించాలి

పాలకొండ రూరల్ : ప్రజలు తెలియజేసిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం సమస్యలను ఆయా విభాగాల అధికారులకు తెలియజేశారు.

కేజీబీవీలో శిక్షా సప్తాహ్



సీతంపేట: ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న జీసీడీఓ రోజారమణి

సీతంపేట: జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమలు చేసి నాలుగేళ్లవుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక కేజీబీవీలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష జీసీడీఓ రోజారమణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితంతో పాటు ఇతర సబ్జెక్టులలో చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిడ్డిక రూప, తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని జీసీడీఓ రోజారమణి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రాజెక్టులను తిలకించి, వాటి సారాంశాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రవీంద్ర, వైద్య సిబ్బంది

భామిని: ప్రజలందరూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర సూచించారు. ఈ మేరకు పక్కుడుభద్రలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. అనుమానితుల నుంచి రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేపడుతున్న ఏఎంవీఐ, ఆర్టీసీ డిపో మేనేజర్

పాలకొండ రూరల్: వాహనచోదకులు నిబంధనల మేరకు డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పాలకొండ – సీతంపేట ప్రధాన రహదారిలో ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంటేశ్వరరావుతో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపటం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం, ట్రాఫిక్ రూల్స్ అధిగమించడం నేరమన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొమరాడ వద్ద నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

కొమరాడ: నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరుగుతోందని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆర్.రమేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో నాగావళి నదీ ప్రవాహన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల వేట కోసం ప్రజలు నదిలో దిగరాదని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్ఓ శ్రీనివాసరావు ఉన్నారు.

తస్మాత్..

నాగవళి నదీ తీర ప్రాంత గ్రామాలైన కల్లికోట, దుగ్గి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నీలకంఠం సూచించారు. సోమవారం కల్లికోట, దుగ్గి ప్రజలకు అవగాహన కల్పించారు.

సమస్య పరిష్కరించకుంటే చలో కలెక్టరేట్

గరుగుబిల్లి: శివ్వాం గ్రామంలోని దళితుల సమస్యను రెవెన్యూ అధికారులు స్పందించి పరిష్కరించకుంటే ఈ నెల 29న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. 1970లో 14మంది దళితులకు 22.85 ఎకరాల ప్రభుత్వం భూమిని మంజూరు చేసిందన్నారు. సర్వే నెంబర్ 102లో గ్రామంలోని కొందరు రైతులు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి దళితులు సాగు చేస్తున్న భూమిని ఆక్రమించుకొనేందుకు సిద్ధపడ్డారన్నారు. ఈ నేపథ్యంలో దళితులు, గ్రామంలోని రైతుల మధ్య పోలీసుల సమక్షంలోనే కొట్లాట జరిగిందని, ఈ ఘటనపై పోలీసులు రైతులపై ఎలాంటి కేసులు కూడా నమోదు చేయలేదన్నారు. కోర్టు నుంచి తెచ్చిన ఇంజక్షన్‌లో హద్దులు కూడా సక్రమంగా లేవని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ ఆధ్వర్యంలో సర్వేను కూడా నిర్ధారించారన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు దళితులు సాగు చేస్తున్న భూమిని అప్పగించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ భూ సమస్యను తక్షణం పరిష్కరించాలని అమరావతి సీసీఎల్ఆర్ కార్యాలయం నుంచి కూడా ఆదేశాలు వచ్చాయన్నారు. అయినప్పటికీ దళితులకు న్యాయం చేయడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

పూడికతీతల తొలగింపు..



పోతులగెడ్డ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రమణ

పాలకొండ రూరల్: మండల పరిధిలోని పోతులగెడ్డలో పూడికతీత పనులను ఆర్డీఓ పీవీ రమణ నేతృత్వంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల పాలకొండ వచ్చిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను స్థానిక యువత , పలువురు రైతులు కలసి సాగునీటి కాలువ సమస్య వివరించారు. నగర పంచాయతీ పరిధిలో పెద్దకాపు వీధి మీదుగా పంట పోలాలకు సాగునీరు అందిస్తున్న పోతులగెడ్డ కాలువలో పూడికలు, వ్యర్థాలు పేరుకుపోవడంతో దాదాపు వంద ఎకరాలకు సాగునీరు అందడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించగా.. ఆర్డీఓ పీవీ రమణ, ఇరిగేష్ ఏఈ శంకర్, తదితరులు కాలువను పరిశీలించి, పనులు చేపట్టారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యాధికారులతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కుక్క కాటు, పాము కాటు తదితర వ్యాక్సిన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రులకు అవసరమైన అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. సమావేశంలో వైద్యాధికారులు కె.కార్తీక్, ఎస్.సంతోష్‌కుమార్, స్థానిక సర్పంచ్ కె.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌మిల్లుపై చర్యలకు డిమాండ్



నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఆయిల్‌పామ్ గెలలు

కురుపాం: లక్ష్మీబాలాజీ ఆయిల్ మిల్ పరిధిలో నుంచి అక్రమంగా, చట్ట వ్యతిరేకంగా ఆయిల్‌పామ్ పంటను తరలిస్తున్న శ్రీ శ్రీనివాస ఆయిల్ మిల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు లక్ష్మీ బాలాజీ ఆయిల్‌పామ్ మిల్ వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆయిల్‌పామ్ కంపెనీలు, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 – 25 సీజన్లో ఇవ్వబడిన లక్ష్యాలు, మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌పై సమీక్ష జరిపిన కలెక్టర్ ఉద్యావన శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లక్ష్మీబాలాజీ ఆయిల్‌పామ్ మిల్‌కు చెందిన సభ్యులు తెలిపారు.

అభినందనలు



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు

వీరఘట్టం: ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నీలానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన దుప్పాడ సంజన, ఎస్.చరణ్, బుగత రేవతి, బొత్స రామలక్ష్మి, కె.సోమశేఖరరావు, పి.ఈశ్వరిలను గ్రామానికి చెందిన పాలవలస అమ్మడమ్మ, సన్యాసినాయుడు మెమోరియల్ ట్రస్టు సభ్యులు, పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు. అలాగే ప్రతి విద్యార్థికీ రూ.2 వేల నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదువుకుని తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాలవలస గోపాలకృష్ణారావు, హెచ్‌ఎం గుంట్రెడ్డి రవిప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



నగర పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని బుట్టిమఠం కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో కాలనీకి చెందిన మహిళలు తమ గోడును కమిషనర్ సర్వేశ్వరరావుకు విన్నవించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. 15 ఏళ్ల కిందట స్థానికులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించగా.. సుమారు 1500 మంది నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. అయితే ఇంతవరకు ఆ కాలనీకి తాగునీరు, కాలువలు, రహదారులు, విద్యుత్ సదుపాయం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాలతో కాలనీలో జీవించడం కష్టతరంగా మారిందని చెప్పారు. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఽ సీఐటీయూ నాయకులు కాద రాము, ఎం. విజయమ్మ, ఎస్. రాజేశ్వరి, ఎస్. సుశీల పాల్గొన్నారు.

రక్తహీనత కేసులపై ప్రత్యేక దృష్టి

- రక్తనిధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు: రక్తహీనత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీసారు. చికిత్స పొందుతున్న చిన్నారులు, పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు రక్తపరీక్షలు చేసి రక్తహీనతను పరిశీలించాలని అన్నారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్కువ రక్తనిధి కేంద్రాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలిపారు. గర్భిణులలో రక్తహీనతను అధిగమించే చర్యలు తీసుకోవడం వలన ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం విధిగా అందించాలని దీనిపై పక్కాగా పర్యవేక్షణ చేయాలని అన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులు తాకిడి అధికంగా ఉన్నందున తాత్కాలిక షెడ్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శివకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.